

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# లాభాల పూ'బంతి



యాచారం మండలంలో విరబూసిన బంతిపూలు

**సాంప్రదాయ పంటలతో అంతంత మాత్రంగా ఆదాయం**

**బంతిపూల సాగు వైపు రైతుల మొగ్గు**

**తక్కువ పెట్టుబడి..తక్కువ నీరు..తక్కువ సమయం ఫార్ములా**

**జిల్లాలో 200 ఎకరాల్లో సాగు**

**కిలో రూ.వంద చొప్పున పలికిన ధర**

(ప్రభాతవార్త-రంగారెడ్డి అర్బన్)

ప్రతి ఏటా సాగుచేసే వరి, పత్తి పంటలతో అంతంత మాత్రంగా లాభాలు పొందుతున్న పలువురు రైతులు వినూత్నంగా ఆలోచించి బంతిపూల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. సరైన సీజన్‌లో పూల సాగు చేపట్టి లాభాలు గడిస్తున్నారు. ముఖ్యంగా తక్కువ పెట్టుబడితో, తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం సంపాదించే అవకాశం ఉండటంతో పలువురు ఈ సాగును ఉపాధి మార్గంగా ఎంచుకుంటున్నారు. పెళ్లిళ్లు, పండుగల సీజన్‌లో బంతి పూలకు ఎప్పుడూ డిమాండ్ ఉండటం వల్ల ఇది లాభసాటి పంటగా మారింది. సరైన సీజన్‌లో, సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే, ఈ సాగుతో మంచి లాభాలు పొందవచ్చని పలువురు ఆదర్శరైతులు చెబుతున్నారు.

రంగారెడ్డి జిల్లాలో దాదాపు 200 ఎకరాల్లో బంతి పూల సాగును చేపట్టారు. అటు దిగుబడితో పాటు ఈసారి మంచి ధర పలకడంతో బంతిపూల రైతులకు కాలం కలిసి వచ్చింది. పంటకు పెట్టుబడి బాగా పెరిగినప్పటికీ, చాలా మంది రైతులు రోడ్లపై రిటైల్‌గా బంతి పూలను కిలో వంద రూపాయలకు అమ్ముకున్నారు. పూలు కావలసిన ప్రజలు కూడా బంతి పూల తోటల వద్దకు వెళ్లి కొనుగోలు చేశారు. ఎకరంలో 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు బంతి పూల దిగుబడి రావడంతో రెండు లక్షల రూపాయలు వరకు రైతులకు ఆదాయం లభించింది. బతుకమ్మ, దసరా పండుగలకు బంతి పూలకు ఈసారి మంచి డిమాండ్ ఏర్పడడంతోపాటు మంచి ధర పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. దీపావళి పండుగ రోజునా బంతి పూలకు డిమాండ్ బాగా కనిపించింది. గతంలో గిట్టుబాటు ధర లేక కిలో రూ.10 నుంచి 20 రూపాయలకు అమ్మి నష్టపోయిన సందర్భాలు చవిచూశామని రైతులు తెలిపారు. ఈసారి మాత్రం కిలో పూలకు వంద రూపాయలు పలకడం తమను గట్టెక్కించిందని వివరించారు.

**పూర్తి స్థాయిలో విరబూసింది**
**- నడికుడి కృష్ణ, చౌదర్‌పల్లి రైతు**

మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని బంతిపూల సాగు చేశా.. పువ్వులు పూర్తి స్థాయిలో కోతకు రాకపోవడంతో ఇటీవల దసరా పండుగకు అమ్మకాలు తక్కువగా జరిగాయి. ప్రస్తుతం పూర్తిస్థాయిలో కోత దశకు వచ్చింది. దీంతో రెండు రోజుల్లో పువ్వులను కోసి మార్కెట్ తరలిస్తాం.

**సప్లై పెరగడంతో తగ్గిన డిమాండ్**

**నందిగామ :** దీపావళి పండుగ తమ జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆశపడిన బంతిపూల రైతులకు ఈసారి నిరాశే మిగిల్చింది. భారీ వర్షాల కారణంగా బోరు బావుల్లో పుష్కలంగా నీరు ఉండడంతో అధిక లాభాలు పొందచ్చని మండలంలో రైతులు ఎక్కువ శాతం బంతి పూలు సాగు చేశారు. పండగకు రెండు రోజుల ముందే మార్కెట్లకు తెలంగాణలోని పలు ప్రాంతాల నుండి లారీలకు లారీలు బంతిపూలు ఎగమతి అయ్యాయి. సప్లై పెరిగి డిమాండ్ తగ్గడంతో కోనేవారు లేక గిట్టుబాటు కాక, నందిగామ శివారులోని బైపాస్ జాతీయ రహదారి పక్కన పలువురు రైతులు బంతిపూలను పారబోశారు.



నందిగామ వద్ద రహదారిపై బంతిపూలను పారబోస్తున్న రైతులు



బాణాసంచా కాల్చుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు

2

## జిలాలో సందడిగా దీపావళి

దీపావళి సంబరాలు జిల్లాలో ఘనంగా జరిగాయి. ప్రజలు బాణసంచా కాల్చి, ఇళ్లను దీపాలతో అలంకరించారు. ప్రజాప్రతినిధులు కూడా వేడుకల్లో పాల్గొన్నారు, మిఠాయిలు పంచారు.ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# సీఎం సెగ్మెంట్‌లోనూ... ఇంత నిర్లక్ష్యమా?



**కలెక్టర్ సీరియస్**

**ఎన్‌హెచ్ పనులకు బ్రేక్**

**నిర్మాణ సంస్థకు నాలుగు నోటీసులు**

**సిఎం రేవంత్ సొంత నియోజకవర్గం లోనూ అభివృద్ధి పనులకు గ్రహణం పట్టుకుంది. మహబూబ్‌నగర్ నుంచి చించోలి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారితో కొడంగల్, తాండూరు పట్టణాల్లో ట్రాఫిక్ చిక్కుల నుంచి గట్టెక్కవచ్చని స్థానికులు ఆశపడ్డారు. కానీ ఆరంభం నుంచే ఆగుతూ.. సాగుతూ..ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పూర్తిగా నిలిచిపోయాయి.**



అసంపూర్తిగా నిలిచిపోయిన కొడంగల్ - తాండూరు ఫోర్‌లైన్ పనుల దృశ్యం

(ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి)
మహబూబ్‌నగర్ - చించోలి జాతీయ రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎన్‌హెచ్ 167గా పిలువబడే ఈ రహదారి పనులు మూడేళ్లుగా సాగుతున్నాయి. నిర్ణీత గడువు దాదాపు ముగుస్తున్నా చాలా చోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో యేడాది వరకు పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఎన్‌హెచ్‌ఏ అధికారులకు తలనొప్పిగా మారిన కొడంగల్-తాండూరు మార్గం కాంట్రాక్టర్‌పై చర్యలకు రంగం సిద్ధం చేశారు. మహబూబ్‌నగర్ - చించోలి జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ చొరవతో రూ.703 కోట్ల నిధులు మంజూరు చేశారు. బూత్‌పూర్ వద్ద బెంగళూరు జాతీయ రహదారి నుంచి కర్నాటక రాష్ట్రం చించోలి, మన్నెఎక్కేల్లి వద్ద ముంబాయి జాతీయ రహదారికి అనుసంధానం చేయనున్నారు. 96 కిలో మీటర్ల పొడవునా నిర్మిస్తున్న ఎన్‌హెచ్ 167 పనులు మూడేండ్ల క్రితం ప్రారంభించారు. మహబూబ్‌నగర్ నుంచి కొడంగల్ నియోజకవర్గం దుద్యాల వరకు మూడులైన్ల రహదారి పనులు 80 శాతం పనులు పూర్తి చేశారు. దుద్యాల నుంచి కొడంగల్, తాండూరు మీదుగా కర్నాటక సరిహద్దు వరకు 42 కిలోమీటర్ల రహదారి మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. కొడంగల్ - తాండూరు ఫోర్‌లైన్ పనులు ఇప్పటి వరకు 35 నుంచి 40 శాతం వరకే పూర్తి చేశారు. ఉత్తరాదికి చెందిన ఎస్ ఎంసీ ఇన్‌ఫ్రా సంస్థ కాంట్రాక్టర్‌కు ఈ బిట్టు పనులు దక్కాయి. రూ.300 కోట్ల వ్యయంతో రహదారి నిర్మిస్తున్నారు. ఆరంభం నుంచే పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొడంగల్

మిగతా 2లో

### ప్రతి నెలా ఇద్దరు ముగ్గురు మృత్యువాత !

ఇటీవల కలెక్టర్ ప్రతీక్‌జైన్ రహదారి పనులను సందర్శించారు. అర్ధంతరంగా ఆగిపోయిన పనులపై సీరియస్‌గా తీసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గంలోనే పనులు జాప్యం చేస్తే ఎలాగని మందలించినట్లు సమాచారం. వెంటనే పనులు ప్రారంభింపజేయాలని స్పష్టం చేశారు. సదరు నిర్మాణ సంస్థకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండటం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ప్రతినెలా ఒకరిద్దరు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడుతున్నారు. తాండూరు నుంచి మల్కాపూర్, కోటబాసుపల్లి మార్గంలో ప్రజలు మూడేండ్లుగా నరకయాతనకు గురవుతున్నారు. దుమ్ము ధూళి వల్ల అస్వస్థతకు గురవుతున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్య కలెక్టర్ దృష్టికి వచ్చింది. రోడ్డు పనులను సందర్శించిన ఆయన తగిన విధంగా స్పందించారు. ఎమ్మెల్యే బీ.మనోహర్‌రెడ్డి కూడా తరచూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నా కాంట్రాక్టర్ మొరాయిస్తున్నారు.



### పెనాల్టీ వేస్తాం
**హైవే అధికారుల వార్నింగ్**

కొడంగల్-తాండూరు ఫోర్ లైన్ పనులకు బ్రేక్ పడటంతో జాతీయ రహదారుల అథారిటీ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు కాంట్రాక్టర్‌కు ఇప్పటి వరకు నాలుగు నోటీసులు జారీ చేశామని సహాయ ఇంజనీరు సురేందర్ తెలిపారు. గత వారం క్రితం కూడా మరో నోటీసు ఇచ్చామన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయకుంటే పెనాల్టీ వేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని చెప్పారు. పనులు జరపని రోజులను పరిగణలోకి తీసుకుని రోజుకు ఎంత వ్యయం అవుతుందో దాన్ని విభజించి పెనాల్టీ నిర్ధారిస్తామని స్పష్టం చేశారు. ఇంకా పనులు 65 శాతం పెండింగ్‌లో ఉన్నాయని ఆయన వివరించారు.



పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి

# అమర వీరులకు సలామ్

**పోలీసింగ్ అంటే డ్యూటీ మాత్రమే కాదు ప్రజలకు సేవ చేసే మహత్తర అవకాశం**

**అమరవీరుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటాం**

**సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్, ఎస్పీ**

**వికారాబాద్, అక్టోబరు 21, ప్రభాతవార్త :** పోలీస్ అమర వీరుల త్యాగం చిరస్మరణీయం అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా నిర్వహించే పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ, పోలీస్ అమరవీరుల బలిదానం దేశానికి గర్వకారణమని కొనియాడారు. పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు అత్యంత విలువైనవని సమాజంలో భద్రత, శాంతిని కాపాడటంలో పోలీసులు నిరంతరం పోరాడుతున్నారని ఆయన అన్నారు. దేశ సరిహద్దుల్లో 1959లో జరిగిన చైనా దళాల దాడిలో ప్రాణాలు కోల్పోయిన 10 మంది వీరుల త్యాగాలను స్మరించుకోవటం మనందరి బాధ్యత అని అన్నారు. వారి ధైర్యసాహసాలు, దేశభక్తి భావితరాలకు ఎంతో ఆదర్శమన్నారు. జిల్లా పరిపాలనలో పోలీస్ వ్యవస్థ పాత్ర చాలా కీలకమని, జిల్లా ప్రజల తరఫున అమరవీరులకు నివాళులు అర్పిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి మాట్లాడుతూ, దేశ అంతర్గత భద్రత ను కాపాడుతూ, చట్టాన్ని అమలు చేస్తూ ప్రాణాలు కోల్పోయిన వీర పోలీస్ అమరవీరుల త్యాగాల

మిగతా 2లో

# ఎవరి ధీమా వారికే

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 21, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుని ఎన్నికపై పార్టీ శ్రేణుల్లో సర్వత్రా ఉత్కంఠత కొనసాగుతోంది. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశాలు వేరువేరుగా నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకున్నారు. అయితే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షున్ని ఎన్నుకోవటానికి ఏఐసిసి నుంచి ఈసారి జిల్లాకు పరిశీలకులుగా ఏఐసిసి కార్యదర్శి, జిల్లా పరిశీలకులుగా డాక్టర్ అంజలి నింబాల్కర్ విచ్చేసిన సంగతి తెలిసిందే. డిసిసి అధ్యక్షుని ఎన్నికకు పరిశీలకులను పంపిన అధిష్టానం పోటీ చేయాలనుకునే వారు నేరుగా ఆమెకు దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించింది. జిల్లా పరిధిలో ఉన్న మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాలు ఉన్నప్పటికీ ఎక్కువగా డిసిసి అధ్యక్ష పదవి కోసం మేడ్చల్ నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకున్నారు. వారితో పాటు కుత్బుల్లాపూర్ నుంచి మరొకరు దరఖాస్తులు చేసుకున్నట్లు స్పష్టం అవుతోంది. అయితే ముందుగా దరఖాస్తులు చేసుకున్న వారిలో ప్రస్తుత మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోనె మహేందర్‌రెడ్డి, జిల్లా పార్టీ నాయకులు రాపోలు రాములు, శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ జడ్పీటిసి పి.బాలేశ్, మరి కొందరు కూడ ధరఖాస్తులు చేసుకున్న వారిలో ఉన్నట్లు తెలిసింది.

**ముగిసిన డిసిసి సారథి ఎన్నిక ప్రక్రియ**

**రహస్య పద్ధతి ద్వారా అభిప్రాయ సేకరణ**

**అధిష్టానంకు చేరిన నివేదికలు**

**గుంభనంగా ఉన్న అధినేతలు**

**ఎవరికి ఎక్కువ మంది జై కొట్టారు?**

**పార్టీ వర్గాల్లో ఉత్కంఠ**

**తమకే ఛాన్స్ వస్తుందని అభ్యర్థుల ఆశలు**



అభిప్రాయ సేకరణ అనంతరం అధిష్టానానికి నివేదికలు సిద్ధం చేస్తున్న జిల్లా ఎన్నికల పరిశీలకులు డాక్టర్ అంజలి నింబాల్కర్

అయితే జిల్లాలోని డిసిసి అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వారి కోసం జిల్లాకు చెందిన ఐదు నియోజ కవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్

మిగతా 2లో

# గెలుపోటములతో జీవిత పాఠాలు

**అపజయాన్ని స్వాగతిస్తేనే గెలుపు బావుటా**

**షాద్‌నగర్‌లో రూ.2.7 కోట్లతో క్రీడా స్టేడియం**

**వాలీబాల్ టోర్నమెంటుకు రూ.56 లక్షలు మంజూరు చేయిస్తా**

**వాలీబాల్ పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంకర్**

**షాద్‌నగర్, అక్టోబరు 21, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని పటేల్ రోడ్ మసీదు ఆవరణలో సయ్యద్ అసద్ ముక్తార్ అలీ ఆధ్వర్యంలో వాలీబాల్ ఆర్చివ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని, రెండు జట్ల మధ్య జరిగిన పోటీని మొదటి బంతి విసరడం ద్వారా ప్రారంభించారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ, క్రీడలు వ్యక్తిలో సృజనాత్మకత, క్రమశిక్షణ, సమయపాలనను పెంపొందిస్తాయని, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించడం ద్వారా జీవిత పాఠాలు నేర్చుకోవచ్చని తెలిపారు. క్రీడారంగ అభివృద్ధికి 2.7 కోట్ల రూపాయలతో స్టేడియం నిర్మాణం చేపడతామని, ప్రస్తుత వాలీబాల్ టోర్నమెంటుకు 56 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. క్రీడా మైదానాల అభివృద్ధి, గ్రామస్థాయి పోటీల నిర్వహణతో పాటు, క్రీడలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అన్ని విధాలా సహకరిస్తామని పేర్కొన్నారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యం, ఐక్యతకు బాటలు వేస్తాయని, రేపటి దేశ భవిష్యత్తు క్రీడల్లో రాణించే యువత చేతుల్లో ఉందని అన్నారు. మాజీ కౌన్సిలర్ సర్వర్ పాషా మాట్లాడుతూ, క్రీడా రంగానికి ఇలాంటి ప్రోత్సాహం అందించడం శుభ సూచకమని, యువత రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటాలని



క్రీడాకారులతో ఎమ్మెల్యే శంకర్



4

## కొడంగల్‌లో ఆగని నిరసనలు

మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాల తరలింపును ఆపాలని డిమాండ్

ఎడ్యుకేషన్ హబ్‌గా చేయాలని వినతి

## కొనసాగుతున్న స్వచ్ఛంద స్ఫూర్తి

4



సొంత నిధులతో రహదారి రిపేర్లు చేయిస్తున్న కాంగ్రెస్ నేతలు ఆల్లు శ్రీధర్ రెడ్డి, అనేమోని మల్లేష్ యాదవ్



ప్రమాదానికి కారణమైన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు. ఇన్‌సెట్‌లో మృతి చెందిన అధ్యాపకుడు శ్రీనివాస్

# దీపావళికి ఇంటికెళ్లి వస్తూ..

**రోడ్డు ప్రమాదంలో అధ్యాపకుడు మృతి**

**బైక్‌ను ఢీ కొట్టిన మినీ ట్రావెల్స్**

**మరో ఇద్దరికి గాయాలు**

**మేడ్చల్, అక్టోబరు 21, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. కామారెడ్డిలోని బంజెపల్లి గ్రామానికి చెందిన మాలోత్ శ్రీనివాస్ (35) మేడ్చల్ మండలంలోని మైసమ్మగూడలో గల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకుడుగా పని చేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో దీపావళి పండుగ చేసుకుందామని స్వంత గ్రామానికి వెళ్లి తిరిగి మంగళవారం తన బైక్ మీద కళాశాలకు వస్తున్నాడు. ఈ క్రమంలో మేడ్చల్ మండల పరిధిలోని ఎల్లంపేట గ్రామ చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిపై మేడ్చల్ నుండి తూప్రాన్ వైపు వెళుతున్న మినీ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను దాటి రోడ్డుకు అవతలి వైపుకు వెళ్లి మూడు ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా ఇతర బైక్‌ల మీద ఉన్న ఇద్దరు గాయాల పాలయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురికి తరలించారు. గాయాలైన ఇద్దరిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## 97 ఏళ్ల రోగికి ప్రోస్టేట్ శస్త్ర చికిత్స

4

# సిసి రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

## 6వ వార్డ్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శ్రీకారం

**షాద్‌నగర్, అక్టోబరు 21, ప్రభాతవార్త :** షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు టీచర్స్ కాలనిలో సోమవారం అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకర్ శంకుస్థాపన చేశారు. 30 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం డ్రైనేజీ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. వార్డు మాజీ కౌన్సిలర్ పులిమామిడి లతాశ్రీ శ్రీశైలం గౌడ్, కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజలతో కలిసి ఈ అభివృద్ధి పనులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వార్డు ప్రజలు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు అదేవిధంగా దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కాంగ్రెస్ నాయకులు అగనూరు బస్వం బస్వం, కొంకళ్ల చెన్నయ్య, శ్రీశైలం గౌడ్, విజయ్ కుమార్ రెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం, మురళీమోహన్ అప్పి, మాధవులు యాదవ్, ఖదీర్, రాజు నాయక్, మాణిక్యం, శంకర్ గౌడ్, రోమియో రమేష్, సీతారాం యాదగిరి, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్



దీపావళి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

## టిపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

తెలంగాణ పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్‌ని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. దీపావళి పండుగను పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డితో కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువా, పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

దీపావళిని జరుపుకున్న ఎమ్మెల్యే

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన నివాసంలో కుటుంబసభ్యులతో కలిసి టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలిపారు. ప్రజల జీవితాల్లో అందకార చీకట్లు పోయి వెలుగులు నిండాలని ఆయన భగవంతుని ప్రార్థిస్తున్నాను తెలిపారు.

## సిఎం సెగ్మెంట్‌లోనూ ఇంత నిర్లక్ష్యమా!

(మొదటి పేజీ తరువాయి)

నుంచి తాండూరు మండలం కొత్లాపూర్ వరకు అరకొర పనులు చేపట్టారు. మార్గమధ్యలో కల్వర్టులు పూర్తి చేయలేదు. తాండూరు వద్ద భారీ వంతెన, బైపాస్ నిర్మాణం, రైల్వేఫ్లైఓవర్, కొడంగల్‌లో వద్ద అండర్ పాస్ నిర్మించాల్సి ఉన్నది. వీటిని పూర్తి చేయాలంటే మరో యేడాది గడువు పట్టవచ్చని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మంచి సంబంధాలు ఉన్న సదరు కాంట్రాక్టర్ రహదారి పనులను నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సదరు నిర్మాణ సంస్థకు ఇప్పటి వరకు రూ.90 కోట్ల వరకు బిల్లుల చెల్లింపులు జరిపినట్లు సమాచారం. అయితే, మెటిరియల్ కాంట్రాక్టర్లకు, వర్కర్లకు, వాహనాల అద్దెల చెల్లింపుల్లో ఎస్ఎంసీ ఇన్‌ఫ్రా జాప్యం చేస్తున్నదని విమర్శలు వస్తున్నాయి. కాంట్రాక్టర్ నిర్వాకం వల్ల పనులు చేసేందుకు వర్కర్లు నిరాకరిస్తున్నారు. ఫలితంగా కొద్ది రోజులుగా రహదారి పనులు నిలిచిపోయాయి.

## ఎవరి ధీమా వారికే

(మొదటి పేజీ తరువాయి)

చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్, పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పోస్టులు ఉన్న వారి నుంచి జిల్లా పరిశీలకులు డాక్టర్ అంజలి నింబాల్కర్ ముఖాముఖిగా మాట్లాడటం అభిప్రాయాలు సేకరించారు. జిల్లాకు చెందిన పార్టీ ముఖ్యనాయకులు, పదాధికారులు సుమారు 700 మంది నుంచి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎవరు ఉంటే బాగుంటుందనే విషయంపై ఆమె అభిప్రాయాలు సేకరించినట్లు విశ్వసనీయ సమాచారం. అదే విధంగా అన్ని నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పదాధికారులతో డిసిసి అధ్యక్ష పదవికి ఎన్నిక కూడ ఓటింగ్ నిర్వహించినట్లు తెలిసింది. దీనిలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా ఉన్న సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డికి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌కు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్‌కు కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో ఓట్లు పడినట్లు విశ్వసనీయ పార్టీ వర్గాల నుంచి సమాచారం. పోటీలో ఉన్న మిగతా వారికి మేడ్చల్ నియోజకవర్గంలో ఓట్లు లభించినట్లు తెలిసింది. అయితే జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎంపికకు కొన్ని నిబంధనలు పెట్టినట్లు సమాచారం. కనీసం ఐదేళ్ల సీనియారిటీ పార్టీలో ఉండాలన్న నిబంధన ఉన్నట్లు తెలిసింది. ఎన్నికలకు ముందు పార్టీలోకి వచ్చిన వారికి అవకాశం లేకపోవచ్చన్న నిబంధనలు ఉన్నట్లు పార్టీ వర్గాల నుంచి సమాచారం. అదే విధంగ డిసిసి అధ్యక్షులుగా పనిచేసిన వారికి పాత వారికి లేనట్లు కూడ, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిలకు అవకాశం ఇస్తారా లేదా అనేది సందిగ్ధత ఏర్పడింది. ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నాయకుల, పదాధికారుల, కార్యకర్తల అభిప్రాయాలను, ఓటింగ్ సరళిని పరిగణలోకి తీసుకుని అధ్యక్షున్ని ఎంపిక చేయటానికి వీలు ఉంటుందని స్పష్టం అవుతోంది.

గతంలో జిల్లా డిసిసి అధ్యక్షులుగా కూన శ్రీశైలంగౌడ్ పనిచేయటం, కొన్నాళ్లకే ఆయన కాంగ్రెస్ పార్టీని వీడి బిజెపిలో చేరారు. దీంతో డిసిసి అధ్యక్షులుగా నాడు నందికంటి శ్రీధర్‌కు అవకాశం కల్పించారు. అయితే ఆయన ఎన్నికల ముందు కాంగ్రెస్ టికెట్ దక్కకపోవటంతో కాంగ్రెస్‌ను వీడి బిఆర్ఎస్‌లో చేరారు. దీంతో ఎన్నికల సమయంలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (యాక్టివ్) అధ్యక్షులుగా సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని నియమించారు. ప్రస్తుతం హరివర్ధన్‌రెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ యాక్టీవ్ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఇది ఇలా ఉండగ.. గతంలో కాంగ్రెస్ పార్టీని వీడిన కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ మళ్లీ తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరి ఆయన జిల్లా కాంగ్రెస్‌లో కీలకంగా రాణిస్తున్నారు. అయితే డిసిసి రెగ్యులర్‌గా కాకుండ ఆక్టీవ్ అధ్యక్షులుగా పనిచేసినందున తిరిగి తనకే డిసిసి అధ్యక్ష పదవి దక్కుతుందని ఐదు నియోజకవర్గాల్లోనూ అనుకూల మద్దతు లభించిందన్న నమ్మకంలో ఎస్.హరివర్ధన్‌రెడ్డి ఉన్నారు. ఇక మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి కూడ తాను పార్టీలో సీనియర్లం అని తమకు అవకాశం ఉందని ఎవరికి వారే డిసిసి అధ్యక్ష పదవి దక్కుతుందన్న విశ్వాసంలో ఉన్నారు. మిగతా వారు కూడ డిసిసి అధ్యక్ష పదవి దక్కుతుందన్న ఆశలో ఉండి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. త్వరలోనే డిసిసి అధ్యక్ష ఎన్నిక పూర్తికావచ్చని తెలుస్తోంది. ఏది ఏమైనా మేడ్చల్-మల్కాజ్‌గిరి డిసిసి అధ్యక్ష పదవి ఎన్నిక ఫలితంపై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో సర్వత్రా ఉత్కంఠత కొనసాగుతోంది.



ఘట్‌కేసర్‌లో జరిగిన సదర్ ఉత్సవంలో పాల్గొన్న వజ్రేశ్‌యాదవ్, మాజీ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, మాజీ సర్పంచ్ యాదగిరి

## ఘట్‌కేసర్‌లో ఉత్సాహంగా సదర్ ఉత్సవం

**ఘట్‌కేసర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో సదర్ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలోని వాసవీటవర్స్ ఆవరణలో యాదవ సంఘం అధ్యక్షులు రాజబోయిన యాదగిరియాదవ్, ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్‌లో మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ ముఖ్య అతిధిగా పాల్గొ న్నారు. దీపావళీ పండుగ సందర్భంగా సాయంత్రం యాద వులు సదర్ వేడుకలను జరిపారు. అంతకుముందు యాదవ సంఘం భవనంలో శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక పూజలు చేశారు. వజ్రేశ్‌యాదవ్, ముల్లి పావని జంగయ్యయాదవ్, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశగౌడ్, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలు యాదవ్‌లతో పాటు సంఘం సభ్యులు శ్రీకృష్ణభగవాన్‌కి పూజలు చేసి సదర్ ఉత్సవాన్ని ప్రారంభించారు. దున్నపోతులను అలంకరించి హనుమాన్‌నగర్ నుంచి మున్సిపల్ కార్యాలయం, ఎదులాబాద్‌రోడ్డు మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ఊరేగించారు. పలువురు యాదవులు తమ గేదెలను అలంకరించి ఇక్కడ విన్యాసాలతో అత్యుత్తమ ప్రదర్శన చేశారు. గేదెలను నూనెతో మెరిస్తూ, వాటి కొమ్ములను రంగులు వేసి మెడచుట్టూ దండలు, పాదాలకు చీలమండలు, మెడ నుదటిపై గంటలతో సీ-షెల్‌బ్యాండ్‌లె, వాటి కొమ్ములపై నెమలి ఈకలతో అలంకరించారు. ఈకార్యక్రమానికి హాజరైన పలువురు దున్నల విన్యాసాలను తిలకించారు. సదర్‌లో పాల్గొన్న నాయకులను శాలువాలతో సన్మానించి తలకు పగిడి ధరింపచేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు జ్ఞాపికలను అందజేశారు. మాజీ ప్రజాప్రతినిదులు, యాదవసంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమర వీరులకు సలామ్

(మొదటి పేజీ తరువాయి)

స్మరించుకోవాలన్నారు. పోలీస్ ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదని, ప్రజలకు సేవ చేసే మహత్తర అవకాశంగా భావించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో మన జవా న్లు చేసిన, చేస్తున్న కృషి వెలకట్టలేనిది. వారి నిస్వార్థ సేవ, త్యాగాలు జిల్లా పోలీసులకు నిత్య స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన అన్నారు. అమరవీరుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల స్మరణలో భాగంగా నేటి నుండి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన 'జాతీయ ఐక్యత దినోత్సవం' అక్టోబర్ 31వ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు, పోలీస్ అధికారులకు వ్యాసరచన పోటీలు, రక్తదాన కార్యక్రమాలు, సైకిల్ ర్యాలీలు మొదలగు వివిధ కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చెయ్యాలని జిల్లా ఎస్పీ కోరారు. పోలీస్ పరేడ్ అనంతరం అమరవీరుల స్థూపం వద్ద జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి, అదనపు ఎస్పి బి.రాములు నాయక్, జిల్లా లోని పోలీస్ అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయుధ దళాల గౌరవ వందనం మధ్య జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, అమరవీరుల పేర్ల ు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డిఎస్‌పి లు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, బాల కృష్ణ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి జానయ్య, డిటిసి డిఎస్‌పి శ్రీనివాసులు, ఏఆర్ డిఎస్‌పి వీరేష్, ఇన్స్పెక్టర్ లు, ఆర్ఐ లు, ఎస్ఐ లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గెలుపోటములతో జీవిత పాఠాలు

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, సమాజం కలిసి క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాలీబాల్ కిట్లు, నెట్‌లు, క్రీడా సామగ్రిని జట్లకు అందజేశారు. పోటీల అనంతరం విజేతలకు ట్రోఫీని అందజేసి అభినందించారు. సయ్యద్ అసద్ ముక్తార్ అలీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అబ్దుల్ రహీం, అబ్దుల్ కలీం, సంజీవ్ రెడ్డి, కృష్ణ వంటి స్థానిక పెద్దలు, యువ క్రీడాకారులైన సయ్యద్ వాసిఫ్ అలీ, సయ్యద్ వుజేఫా, మహ్మద్ ఉస్మాన్, సయ్యద్ సద్దాం, ఎండి నజీర్, ఇస్మాయిల్, వర్షిత్ రెడ్డి, వడగంటి విజయ్, శరత్ రాథోడ్, ఏతేశ్యాం, శ్రయంత్, శ్రీశైలం యాదవ్, అర్బజ్, ఫర్హాన్, మాజీ కౌన్సిలర్ సర్వర్ పాషా, ఖాబిర్, షేక్ ఫయాజ్, బస్వాం, అప్పి, ముబారక్ ఖాన్, మాధవల్, మహేష్, శేఖర్ అప్ప, లక్ష్మణ్, అప్పి, అశోక్, జయ్ ప్రకాష్, అసద్ బాయ్, ముబారక్, దిలీప్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసంగమేశ్వర దేవాలయంలో నేత్రపర్వంగా కార్తీకమాస మహోత్సవాలు

### -ఆకాశ దీపారాధనతో అంకురార్పణ

**నాంపల్లి, అక్టోబరు 21 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవా దాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురస్కార శైవక్షేత్రం శ్రీసంగమేశ్వర, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో నవంబర్ 20 గురువారం జరిగే కార్తీకమాస మహోత్సవాలు మంగళవారం రాత్రి 6.30 గంటలకు భక్తిశ్రద్ధలతో ఆకాశ దీపారాధనతో అంకురార్పణ నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి.

ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి, ఛైర్మన్ బి.సి.వెంకటేశ్వర రావులు కార్తీకమాస మహోత్సవ ప్రత్యేక పూజాకార్యాక్రమాల వివరాలు వెల్లడించారు. 25 శనివారం నాగులచవితి; 26 ఆదివారం ఉ.9గంటలకు విభూత్యాభిషేకం; 27 మొదటి కార్తీ క సోమవారం ఉదయం 4గంటలకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఉదయం 7.30-9-10.30-12 లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు; నవంబ రు 1 శనివారం ఉదయం 9.30లకు సామూహిక సత్యనారా యణస్వామి వ్రతము; 2 ఆదివారం ఉదయం 9.30లకు శతచ్ఛిద్ర రుద్రాభిషేకము; రాత్రి 6.30లకు తులసీ కళ్యాణం, అల్పాహారం; 3 సోమవారం ఉదయం 4లకు మహాన్యాస పూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఉదయం 7.30-10.30-12లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు; 5 బుధవారం కార్తీకపౌర్ణమి సోమవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఉదయం 7.30-9-10.30-12లకు, రాత్రి 7.00లకు జ్వాలాతోరణం (సంకల్పం), పుష్పాలంకరణ; 9 ఆదివారం ఆరుద్రనక్షత్రం ఉద యం 9.00లకు రుద్రహోమం, 12లకు వనభోజనములు;

10 సోమవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకదశ వార రుద్రాభిషేం, ఉదయం 7.30-9-10.30-12లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు; 15 శనివారం సాయంత్రం 5లకు లక్ష బిల్వార్చన; 16 ఆదివారం ఉదయం 9లకు అన్నాభిషేకము; 17 చివరి సోమవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఉదయం 7.30-9-10.30-12లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు;

16 మంగళవారం మాసశివరాత్రి ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేకం, ఉద యం 7.30-9-10.30లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు, రాత్రి 6.30లకు శివకళ్యాణ మహోత్స వం, అల్పాహారం; 20 గురువారం ఉదయం 9లకు సప్తవిం శతి కలశాభిషేకము పూజాకార్యక్రమాలుంటాయని అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఆయా పూజాది కార్యక్రమాల్లో పాల్గొని ఆ పరమశివుని అనుగ్రహ పాత్రులు కావాలని పి.లక్ష్మారెడ్డి, బి.సి.వెంకటేశ్వరరావు, అర్చకులు కోరారు.

# ఘనంగా జరిగిన వెలుగుల పండుగ



బాణాసంచా కాల్చుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు

## ఘనంగా దీపాల పండుగ జరుపుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

**తలకొండపల్లి, అక్టోబరు 21, ప్రభాతవార్త :** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దీపాల పండుగను పురస్కరించుకొని హైదరాబాదులోని తన ఇంటిలో కుటుంబ సభ్యుల తో కలిసి దీపాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఇంటిలో లక్షి ్మ పూజ నిర్వహించి అనంతరం సాయంత్రం వేళలో భార్యా మాధవి రెడ్డి కుమారులతో కలిసి బాణాసంచా కాల్చి దీపావళి వెలుగులు ప్రతి ఒక్కరి కుటుంబంలో నిండే విధంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## సాంప్రదాయ పద్ధతిలో దీపాలతో ముస్తాబు

**జిల్లేడు చౌదరిగూడెం, అక్టోబరు 21 (ప్రభాతవార్త):** దీపావళి వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపు కొన్నా రు. సోమవారం నాడు దీపావళి సందర్భంగా వ్యాపారస్తులు వారి వారి దుకాణాలను రంగురంగుల విద్యుత్ దీపాలు పూలదండలతో ముస్తాబు చేశారు. ఇంకా మండలంలోని ప్రజలందరూ ఇండ్లను శుభ్రం చేసి ద్వారాలకు పచ్చని తోరణాలు కట్టి ,రంగురంగుల పూలదండలతో సాంప్రదాయ పద్ధతిలో దీపాలతో ముస్తాబ్ చేశారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో లక్షి ్మ పూజ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆ తర్వాత టపాసులను ఆనందోత్సవాలతో కాల్చినారు. దీపాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని పూలు , టపాసులు, స్వీట్ల దుకాణాల వద్ద కొనడానికి ప్రజలు రద్దీ కనిపించింది. మండల కేంద్రంతో పాటు యువకులు అర్ధరాత్రి వరకు బాణా సంచాలు కాల్చి సంబరాలను జరుపుకున్నారు.



దీపావళి సందర్భంగా టపాకాయలు కాలుస్తున్న దృశ్యం

## చిన్నా పెద్ద తేడా లేకుండా ఆనందాల మధ్య పండుగ

**జిల్లేడు చౌదరిగూడెం, అక్టోబరు 21 (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాలలోని చిన్నారులు, యువకులు టపాకాలు, బాణాసంచాలు కాల్చి ఇళ్లముందు వెలుగులు నింపారు. ఆడపడుచులు తీపి వంటలు చేసి విందులు చేసుకున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ ఆనందాల మధ్య పండుగను జరుపుకున్నారు. గ్రామస్తులందరూ సుఖసంతోషాలతో ఉండాలని గ్రామ పెద్దలు దేవుళ్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## వెలుగులతో మెరిసిన మేడ్చల్

**దీపావళి సంబరాలతో రెండు రోజుల పాటు ఆనందోత్సాహం**

**ప్రజలతో నిండిన వీధులు, టపాకాయల కాంతులతో మెరిసిన ఆకాశం**

**మేడ్చల్, అక్టోబరు 21, ప్రభాతవార్త :** ఈసారి మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి మొత్తం వెలుగులతో, రంగులతో, ఆనందాలతో నిండిపోయింది. దీపావళి పండుగను ప్రజలు ఎంతో ఉత్సాహంగా, కుటుంబ సమేతంగా జరుపుకున్నారు. ఈసారి పండుగ రెండు రోజులు రావడంతో కొంతమంది రెండు రోజుల పాటు సంబరాలు జరుపుకోగా, మరికొందరు ప్రధాన రోజు మాత్రమే వేడుకలు నిర్వహించారు. ఉదయమే లేచి స్నానం చేసి కొత్తబట్టలు ధరించిన ప్రజలు, సాయంత్రం వేళల్లో ఇళ్ళ ముందు దీపాలు వెలిగించి, టపాకాయలు కాల్చుతూ పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు. పిల్లలు పెద్దలు అందరూ వీధుల్లో చేరి పటాకులతో ఆకాశాన్ని వెలిగించారు. వ్యాపారులు తమ దుకాణాల్లో లక్షీ ్మదేవి పూజలు ఘనంగా నిర్వహించారు. గృహిణీలు ఇంటి ముందు రంగోలీలు వేసి, దీపాలతో అలంకరించారు. ప్రతి వీధి, ప్రతి ఇంటి చుట్టూ వెలుగులు వెలిగిపోవడంతో మేడ్చల్ మొత్తం ఒకే వెలుగుల సముద్రంగా మారింది.

దీపావళి పండుగ సందర్భంగా పితృదేవతలకు పూజలు చేసే భాగంగా చాలామంది సమాధుల వద్దకు వెళ్లి దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఈ సందర్భంలో వృద్ధులు, యువత, పిల్లలు అందరూ కలిసి పాల్గొని పాత సంప్రదాయాలను కొనసాగించారు. మంగళవారం అమావాస్య సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగడంతో ఉత్తర భారత దేశానికి చెందిన కుటుంబాలు కూడా ఆ రోజు దీపావళిని ఘనంగా జరుపుకున్నారు. అందువల్ల మేడ్చల్‌లో ఈసారి దీపావళి రెండు రోజుల పాటు పండగ వాతావరణంలో కొనసాగింది.



షాబాద్ లో దీపావళి సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

## భక్తి శ్రద్ధలతో దీపావళి సంబురాలు

**షాబాద్, అక్టోబరు 21, ప్రభాతవార్త :** దీపావళి పండుగను పురష్కరించుకొని సోమవారం షాబాద్ మండలంలో అన్ని గ్రామాల ప్రజలు ఆనందోత్సాహాలతో దీపావళి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. టపాకాయలు, దీపాలు, బొమ్మల కొలువులు, కేదారేశ్వరస్వామి వ్రతాలు ఘనంగా జరుపుకున్నారు. మామిడి తోరణాలు, బంతి పూలు, విద్యుత్ దీపాలతో దుకాణ సుముదాయాలను అలకంరించారు. వ్యాపారులు లక్షీ ్మ పూజలు చేశారు. ఇళ్లను దీపాలతో అలం కరించి లక్షీ ్మదేవికి స్వాగతం పలికారు. చిన్నా, పెద్ద తేడాలేకుండా బాణసంచా కాల్చి అంగరంగ వైభవంగా సంబురాలు చేసుకున్నారు.

## ఘట్‌కేసర్‌లో ఆనందోత్సాహాల మధ్య దీపావళి సంబురాలు

**ఘట్‌కేసర్, అక్టోబరు 21, ప్రభాతవార్త :** ఘట్‌కేసర్‌లో దీపావళీ వేడుకలు అంబరాన్ని తాకాయి. ప్రజలు ఆనందోత్సవాల మధ్య దీపావళిని ఎంతో ఘనంగా జరుపుకున్నారు. రెండు రోజుల పాటు అమవాస్య ఉండటంతో సోమ, మంగళవారం ప్రజలు వెలుగుల పండుగ దీపావళిని సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ప్రజలు తమ ఇళ్లకు సున్నం, రంగులు వేసి మామిడి, అరటి తోరణాలు, బంతిపూలతో అలంకరించారు. ఇళ్లలో సత్యనారాయణస్వామి వ్రతాలు, కేదార గౌరీనోములను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వ్యాపారస్తులు తమ సంస్థలు, కార్యాలయాల్లో ధనలక్ష్మి పూజలు నిర్వహించారు. ఘట్‌కేసర్, బాలాజీనగర్, శివారెడ్డిగూడ, బొక్కోనిగూడ, చందుపట్లగూడ, ఎదులాబాద్, ఎన్ఎఫ్‌సినగర్, కొండాపూర్, ఘణాపూర్, అవుషాపూర్, అంకుశాపూర్, మర్రిపల్లిగూడ, మాదారం తదితర గ్రామాల్లో రెండు రోజుల పాటు దీపావళీ పండుగ ఘనంగా జరుపుకున్నారు. దేశాలయాలకు వెళ్లి దైవ దర్శనాలు చేసుకొని పూజలు చేశారు. ఇళ్లలో పలువురు బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి ధనలక్ష్మి అమ్మవారిని పూజించారు. సాయంత్రం ప్రజలు ఇళ్లవద్ద దీపాలను వెలిగించారు. ఇళ్లు, దుకాణాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దుకాణాలు, కంపెనీలలో ధనలక్ష్మి పూజలు చేశారు. మిఠాయిలు తినుపించుకొని దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దీపావళీ సందర్భంగా ఘట్‌కేసర్‌లో పండుగ కొనుగోళ్లతో గత నాలుగు రోజులుగా మార్కెటంతా కిటకిటలాడింది. పాతజాతీయరహదారిపై పెద్దసంఖ్యలో దుకాణాలు వెలిశాయి. దీపావళికి భాణాసంచా, ప్రమిదలు, మిఠాయి, వివిధ రకాల బొమ్మలు, బంతి, చామంతిపూలు, పళ్లు, గుమ్మడి కాయల విక్రయాలు జోరుగా జరిగాయి. బాణాసంచా వ్యాపారులు ఇష్టారీతన ధరలను పెంచి టపాసులను విక్రయించారు. పండుగ సందర్భంగా పలు గ్రామాల్లో దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు వాహన, దుకాణాలకు పూజలు చేశారు. ఆకాశంలో తారాజువ్వలు సందడి చేశారు. బాణాసంచా శబ్దాలతో గ్రామాలన్ని మారుమోగిపోయాయి. చిన్నా,పెద్దా అందరూ హుషారుగా బాణాసంచా కాల్చుతూ ఆనందాన్ని పంచుకున్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు దీపావళీ శుభాకాంక్షలు తెలియజేశారు.



దీపావళి సందర్భంగా ఇంట్లో లక్ష్మీ పూజ నిర్వహిస్తున్న మహిళలు



ఘట్‌కేసర్ మున్సిపల్ ఘణాపూర్‌లో కేదారగౌరీనోము పూజ



ఎంపీ లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న గురుకుల్ పరిరక్షణ సమితి సభ్యులు

## గురుకుల్‌కు పూర్వవైభవం తీసుకురావాలి

**ఘట్‌కేసర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లోని గురుకుల్ విద్యాసంస్థను అభివృద్ధి పరచి పూర్వవైభవం తీసుకురావాలని గురుకుల్ పరిరక్షణ సమితి సభ్యులు రాజ్యసభసభ్యులు డాక్టర్ కోవ లక్ష్మణ్, ఆర్యసమాజ్ సభ్యులు విఠల్‌రావును కలిసి విజ్ఞప్తి చేశారు. గురుకుల్ విషయంలో జరుగుతున్న పరిణామాలపై వారు చర్చించి అవసరమైన పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆర్యసమాజ్ సభ్యులతో సమావేశం నిర్వహించి గురుకుల్ ట్రస్ట్ భూముల పరిరక్షణ, తరగతుల నిర్వహణ, విద్యార్థులకు సౌకర్యాల కల్పనపై చర్యలు తీసుకుంటామని ఎంపీ లక్ష్మణ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఘట్‌కేసర్ రైతు సేవాసహకార సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, న్యాయవాధి కొమ్మిడి రాఘవరెడ్డి, గురుకుల్ పరిరక్షణ సమితి సభ్యులు అంకం సురేశ్‌కుమార్, కొమ్మడి మహిపాల్‌రెడ్డి, కొమ్మిడి విక్రాత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 21, ప్రభాత వార్త:** పాడి రైతులు పశువులకు ముందస్తుచర్యగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించు కోవాలని ఘట్‌కేసర్ మండల పశువైద్యాధికారి పద్మిని అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని యంనంపేట్‌లో మంగళవారం పశు వులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మొత్తం 160 పశువులకుగాను 129 గేదేలు, 31 ఆవులకు టీకాలు వేసినట్లు తెలిపారు. దాదాపు పది మంది రైతులకు చెందిన పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారితో పాటు పశువైద్య సహాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పోచారం మున్సిపల్ యంనంపేట్‌లో గేదెకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న పశువైద్యాధికారి పద్మిని

## నవోదయ, సైనిక్ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 21, ప్రభాతవార్త :** జవహర్ నవోదయ, సైనిక్ స్కూళ్లలో ప్రవేశాలకు ఉచిత శిక్షణ ఇచ్చి గ్రామీణ పేద విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నట్లు రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. తాండూరు పట్టణంలోని భాష్యం జూనియర్ కళాశాల ఆవరణలో రెండో బ్యాచ్ విద్యార్థులకు శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు టీ.కృష్ణయ్య ముదిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల వరకు తరగతులు ఉంటాయని చెప్పారు. గడచిన 30 ఏళ్లుగా సేవా సంస్థ ద్వారా ఉచిత శిక్షణ అందిస్తూ ఎంతోమంది పేద విద్యార్థులు నవోదయలో సీట్లు సాధించారు. నిష్ణాతులైన అధ్యాపక బృందం ద్వారా శిక్షణ ఇస్తున్నారు. మాక్ టెస్ట్‌లు, ప్రాక్టీస్ పేపర్లు, గ్రాండ్ టెస్ట్‌లు, ఆన్లైన్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. తాండూరు పరిసరాల గ్రామీణ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైదాన్ మిత్రమండలి ధారాసింగ్, సాంబూరు సోమశేఖర్, మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసచారీ, కోలుకుందే విజయ్‌కుమార్, చెనిమిళ్ల బస్వరాజ్, రాజాం విజయ్‌కుమార్, సాయిరెడ్డి, సురేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి సూచించారు. రెండో బ్యాచ్ శిక్షణ తరగతులను ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడారు. పేద విద్యార్థులను తీర్చి దిద్దాలన్న సంకల్పంతో 30 ఏళ్లుగా ఉచితంగా శిక్షణ ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు.

## మానసిక వికలాంగుడు ఆకాశ్ అదృశ్యం

### ..మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు

**శామీర్‌పేట, అక్టోబరు 21 ప్రభాతవార్త :** శామీర్‌పేటలోని క్రిస్టల్ ఆశ్రమం (స్పెషల్ హోమ్ ఫర్ డిజబుల్డ్ చిల్డ్రన్స్)లో ప్రత్యేక అవసరాల పిల్లలు నివసిస్తున్నట్లు దీనిలో ఉంటున్న ఆకాశ్ (14) అనే బాలుడు కనిపించకుండ పోయినట్లు దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం శామీర్‌పేటలోని క్రిస్టన్ ఆశ్రమంలో ఉంటున్న ఆకాశ్ (14) అనే బాలుడు ఆశ్రమం నుంచి ఈ నెల 16వ తేదీ నుంచి కనిపించకుండ పోయినట్లు ఆశ్రమ సూపర్‌వైజర్ రాజన్‌భేహరా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాలుడు ఎత్తు 4అడుగులు.5అంగుళాలు, రంగు మధ్యస్థం, ముఖం గుండ్రంగా ఉంటుందని, దస్తులు క్రీమ్ రంగు చొక్కా, నీలం రంగు ప్యాంటు ధరించినట్లు తెలిపారు. ఆ బాలుడు మానసికంగ వికలాంగుడు అని, సరైన రీతిలో మాటల మాట్లాడలేరని, తన పేరు, కొన్ని మాటలు మాత్రమే మాట్లాడుతారని పోలీసులు తెలిపారు. ఆశ్రమం వారి ఫిర్యాదు మేరకు శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మానసిక వికలాంగుడు ఆకాశ్

## నేడు జిల్లా రైతు సంఘాల సమాఖ్య సమావేశం

### ..యాసంగి సన్నవడ్లకు రైతులకు ఇప్పటి వరకు బోనస్ రాక ఇబ్బందులు

### ..చర్చించనున్న వైనం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 21, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జిల్లా రైతు సంఘాల సమాఖ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2గంటలకు జరుగుతుందని మేడ్చల్ జిల్లా రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షులు ముద్దం సంజీవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ అధికారి (డిఎఒ) కార్యాలయంలో జరిగే సమావేశంలో రైతులకు యాసంగి సన్నవడ్లకు బోనస్ రానందున ఈ విషయంపై, అదే విధంగా విద్యుత్, రెవెన్యూ సమస్యలపై సంబంధించిన సమస్యలు, రుణమాఫీ రాని రైతుల కొరకు అన్ని ఆయా విషయాలపై ఈ సమావేశంలో చర్చించటం జరుగుతుందని, జిల్లాలోని అన్ని గ్రామాల రైతు సంఘాల ప్రతినిధులు రైతులు అందరు సకాలంలో విచ్చేసి పాల్గొనాలని ఆయన కోరారు.

## ఇసుక రీచ్‌లను పరిశీలించిన అసిస్టెంట్ డైరెక్టర్

### మైన్స్ అండ్ జివాలజీ, సత్యనారాయణ

**పెద్దెముల్, అక్టోబరు, 21, ప్రభాతవార్త;** పెద్దముల్ మండల పరిధిలోని రేగోండి, కొండాపూర్, గ్రామాలల్లో మంగళవారం నాడు ఇసుక రీచ్‌లను అసిస్టెంట్ డైరెక్టర్ మైన్స్ అండ్ జివాలజీ సత్యనారాయణ, పరిశీలించారు. ప్రభుత్వ పనులతో పాటు గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందించేందుకు గుర్తించిన్నట్లు అధికారుల బృందం తెలిపింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటర్, ఇంజనీర్ ఇరిగేషన్, మండల తహశీల్దార్, మండల అభివృద్ధి అధికారి, మండల సర్వేయర్, మైన్స్ అండ్ జువెలరీ డిపార్టుమెంట్, టీఏ, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు,



రేగొండి, కొండాపూర్ గ్రామాలల్లో ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న అధికారుల బృందం, అసిస్టెంట్ డైరెక్టర్ మైన్స్ అండ్ జివాలజీ, సత్యనారాయణ,

## త్రీ చైల్డ్ పాలసీ రద్దు పట్ల హర్షం

### సీఎం, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన జిల్లెల్ల బాల్ రెడ్డి

**నందిగామ, అక్టోబరు 21, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ముగ్గురు పిల్లల నిబంధనను తొలగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం హర్షనీయమని నందిగామ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లెల్ల బాల్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇద్దరు పిల్లలకు మించి సంతానం ఉన్నవారు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులనే నిబంధనలను తొలగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, షాద్నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్రీ చైల్డ్ పాలసీ రద్దు చేయడం వల్ల ప్రజాసేవ చేయాలనుకునే ఎంతోమంది సామాన్య ప్రజలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల నరసింహులు యాదవ్, కె రాంరెడ్డి, చించేటి శివగౌడ్, బి ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.




నందిగామలో మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నేత బాల్ రెడ్డి, గురుస్వామి సతీష్ నాయర్

## కీర్తిశేషులు సతీష్ నాయర్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే

**నందిగామ, అక్టోబరు 21, ప్రభాతవార్త :** భక్తిభావంతో అందరికీ ఆధ్యాత్మిక చింతన అవశ్యకతను బోధించిన గురుబ్రహ్మ, కీర్తిశేషులు సతీషన్ నాయర్ గురుస్వామి కారణజన్ముడని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. నందిగామ మండలం అంతిరెడ్డిగూడ గ్రామంలో సోమవారం ఎంబడి అంజి, గడ్డల యాదగిరి ల ఆధ్వర్యంలో జరిగిన అయ్యప్పపూజలో పాల్గొనారు. ఆనంతరం కీర్తిశేషులు సతీష్ నాయర్ గురుస్వామి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కేరళ వాయిద్యాలతో కనుల పండువగా సాగిన అయ్యప్ప స్వామి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి గిరీష్ నాయర్, బి.లక్ష్మయ్య యాదవ్, డి.శంకరయ్య గౌడ్, దేపల్లె అశోక్ గౌడ్, జంగ నర్సింలు యాదవ్ ,కుమార్ గౌడ్, తుమ్మల నరసింహులు,అశోక్, అయ్యప్ప స్వాములు, తదితరులు పాల్గొన్నారు.



కీర్తిశేషులు గురుస్వామి సతీష్ నాయర్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే

## బైపాస్ జాతీయ రహదారిపై స్కూటీ బోల్తా..

## స్కూటీ ఎవరిది.. అసలేం జరిగింది..?

**నందిగామ, అక్టోబరు 21, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్ర పరిధిలో44 వ బైపాస్ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం అగుపించింది. హైదరాబాదు నుండి షాద్నగర్ వైపు వస్తున్న స్కూటీ అదుపుతప్పి పడిపోయినట్లు ఆనవాళ్లు అగుపిస్తున్నాయి. స్కూటీ ఎవరిది..? అసలేం జరిగింది.? వాహనదారుడి పరిస్థితి ఏంటి..?వంటి పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.



నందిగామ బైపాస్ జాతీయ రహదారి పక్కన పడి ఉన్న స్కూటీ



# సీతా ఫల్ మీఠా ఫల్

## ప్రకృతి వరప్రసాదం

## గిరిజనులకు ఉపాధిగా మారిన సీతా ఫలాలు

**మర్పల్లి, అక్టోబరు 21 ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలోని పలు గిరిజన తాండా వాసులకు సీతా కాలంలో లభించే సీతా ఫల పండ్లు పలువురు గిరిజనులకు ఉపాధి కల్పిస్తున్నాయి.సెప్టెంబర్ మాసం నుండి నవంబర్ నెల వరకు మూడు నెలల వరకు సీతా కాలంలో సీతా ఫలాలు లభించడంతోమూడు నెలల పాటు పలువురికి ఉపాధి లభిస్తుంది, మర్పల్లి మండలంలోని షాపూర్ ,గుర్రంగట్టు. దామస్తాపూర్,కట్టేపాడు,మర్పల్లి పలుగిరిజక తాండా వాసులు సుమారు రోజుకు 50 నుండి 100 మంది వరకు సీతాఫలాలు అమ్ముతూ జీవనోపాధి గడుపుతున్నారు.ప్రకృతి వరప్రసాదించిన స్వచ్ఛమైనా ఎలాంటి రసాయనిక పదార్థాలను వాడకుండా,హైబ్రిడ్ కాకుండా ప్రకృతిలో సహజ సిద్ధమైన సీతా ఫలాలు గ్రామీణ ప్రాంతాలలో లభించడంతో మధురమైనా సీతా ఫలాలు తినడానికి ఎందరో ఇష్టపడుతారు. గిరిజన తాండాలలో పురుషులు పొద్దంతా అటవీ ప్రాంతాలలో సీతాఫలకాయలను సేకరించి వాటిని పక్వానికి పెడుతారు. అందులో ఎలాంటి రసాయనిక పదార్థాలైనా కార్బేట్ లాంటివి లేకుండానే పక్వాం చేసి మార్కెట్లో అతి తక్కువ ధరలకే విక్రయిస్తారు.మండల కేంద్రంలోని బీదర్ వెళ్ళే రైలుకురోజు సమారు 50 మంది వరకు గిరిజన మహిళలు గంపలలో పండ్లను నింపుకుని జహీరాబాద్,బీదర్ వరకువలు ప్రాంతాలకు 5రూపాయలనుండి 10 రూపాయల చొప్పున విక్రయిస్తారు, సీతాఫలాలతో రోజు ఉపాధి లభిస్తుందనీ రెండు మూడు నెలల పాటు ఉపాధి లభిస్తుందనీ గిరిజనులు కొందరు పేర్కొంటున్నారు.



రైలుకోసం వెయిట్ చేస్తున్న మహిళలు



పండ్లు అమ్మడానికి వెళుతున్న మహిళలు

**అంతరిస్తున్న సీతాఫలాలు:** ప్రకృతి సిద్ధమైన పండ్లు సీతా ఫలా ,రేగుపండ్లు,అడివిలో లభించే పలు రకాల పండ్లవృక్షాలు రోజు రోజుకు అంతరించి పోతున్నాయి. హైబ్రిడ్,వృక్షాలు,రకరకాల క్రిమిసంహారక మందులు కొట్టిన పండ్లే మార్కెట్లో అధికంగా లభిస్తున్నాయి.పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలని పండ్లు భుజించడం వలన ఆరోగ్యం ఎంతో మేలు అని నేడు మార్కెట్లో లభించే అరటి,యాపిల్,ద్రాక్షా, మొదలగు పండ్లు కార్బేట్ పిచికారి చేసి పండ్లుగా మార్చీ విక్రయిస్తున్నారు.వాటిని తినడం వలన ఆరోగ్యం క్షీణిస్తుందే తప్పన ఆరోగ్యం కుదుట పడదనీ పలువురు పేర్కొంటున్నారు.రోజు రోజుకు అడవులు అంతరించిపోవడంతో పండ్ల ఫలాల వృక్షాలు తగ్గిపోతున్నాయి.గుట్టలు తవ్వకాలు,వాడుక వంకలు,సైతం నేలమట్టం కావడంతో పండ్ల వృక్షాలు తగ్గిపోతున్నాయి.

**సీతాఫల మొక్కలను నాటాలి :**

ఉపాధిహామీ పథకం కింద ఏటా వివిధ మొక్కలు నాటుతున్న,పలువురికి ఉపాధి చూపే సీతాఫల ,రేణీపండ్ల,మొక్కలను నాటాలని దానితో పలువురికి ఉపాధి లభిస్తుందని పలువురు కోరుతున్నారు.

## పత్తి రైతులు సిసిఐని సద్వినియోగం చేసుకోవాలి

### మండల వ్యవసాయాధికారి రావినాథ్

**యాచారం,అక్టోబరు 21 ప్రభాతవార్త :** పత్తి ఉత్పత్తి చేసే రైతులు ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసే కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రావినాథ్ తెలిపారు .మంగళవారం యాచారం మండల కేంద్రములోని రైతు వేదిక భవనంలో విలేకర్లుతో మాట్లాడుతూ పత్తికి ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాల్ 8110 రూపాయలు చెల్లించుకున్నట్లు తెలిపారు. తేమ 9 శాతం ఉన్నట్లు అయితే 8028.90 చెల్లిస్తామని పేర్కొన్నారు. తేమ 10 శాతం ఉన్నట్లు మద్దతు ధర క్వింటాల్‌కి 7947 రూపాయలు చెల్లిస్తారనీ తెలిపారు.తేమ 12 శాతంకి పైన ఉంటే కొనుగోలు చేసుకోరని అన్నారు. తేమ శాతం తక్కువగా ఉండేలా ఆరబెట్టి చెత్త లేకుండా శుద్ధి చేసి సీసీఐ కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకొని అమ్ముకోవాలి తెలిపారు.సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో పత్తి అమ్మడానికి ముందు కాపస్ కిసాన్ మొబైల్ అప్ ప్లే స్టోర్ డ్వన్లోడ్ చీసుకోవాలి అని అన్నారు.ఓటిపి ద్వారా స్లాట్ బుక్ చేసుకొని కొనుకోలు చేసుకోవాలని తెలిపారు.వ్యవసాయ శాఖ క్రాప్ బుకింగ్ లో అనుసంధానం కాబడిన రైతు యొక్క ఫోన్ నెంబర్ ను నమోదు చేయగానే మెసేజ్ ద్వారా ఫోన్ కు ఓటీపీ వస్తుంది ఒటిపి నీ నమోదు చేసి స్లాట్ బుకింగ్ చేసుకొనవలెనీ అన్నారు.స్లాట్ బుకింగ్ లో మీరు జిల్లా పేరు,మార్కెట్ పేరు, పత్తిని అమ్మే మిల్లు యొక్క పేరు, పత్తి పరిమాణము,తేదీ మరియు సమయము ఎన్నుకొని సబ్మిట్ చేయాలన్నారు.స్లాట్ బుకింగ్ చేసుకోవడం చాలా సులభం ఒకవేళ ఏదైనా ఒక రైతు స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి ఇబ్బంది అనిపిస్తే మార్కెట్ కమిటీ కార్యాలయంలో సంప్రదిస్తే స్లాట్ బుకింగ్ చేయగలము లేదా మీ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి కూడా స్లాట్ బుకింగ్ చేస్తారని అన్నారు. చెల్లింపులు రైతు యొక్క ఆధార్ నంబర్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో జమ చేయబడును.సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలు తిరుమల ట్రేడింగ్ కంపెనీ, నందిగామ ,హరిహర జిన్నింగ్ ప్రెస్సింగ్ ప్రైవేట్ లిమిటెడ్, నందిగామ ,తుల్జా భవాని కాటెక్స్ నందిగామ,ఎన్డిటి కాటన్ ఇండస్ట్రీస్ కిసాన్ జిల్లింగ్ ప్రెస్సింగ్ ఇండస్ట్రీస్ ఆకుతోటపల్లి గ్రామం అమంగల్ మండలం ,శ్రీ అభిషేక కాటన్ మిల్స్ పోలేపల్లి గ్రామం అమంగల్ మండలం , శ్రీనివాస మురుగన్ ఇండస్ట్రీస్ తలకొండపల్లి గ్రామం మండలం,రైతులు తమ పత్తిని దిది వారి కొనుగోలు కేంద్రంలో సులభంగా అమ్మడానికి పూర్తి సమాచారం కోసం ఈ నంబరును 8897281111ను మీయొక్క మొబైల్ ఫోన్ లో అనుసంధానమైన సెవ్ చేసుకొని వాట్సప్ ద్వారా చాట్ చేసినట్లయితే పూర్తి సమాచారం లభిస్తుంది. ముందుగా హై అని పోస్ట్ చేసి మీకు నచ్చిన భాషను సెలెక్ట్ చేసుకోవాలన్నారు. మీకు ఎన్ని క్వింటాళ్ల పత్తిని అమ్మడానికి అర్హత ఉందో తెలుసుకోవచ్చును,ఏ ఏ మిల్లుల వద్ద పత్తి అమ్మడానికి ఎంతకాలం వేచి ఉండాలనో తెలుసుకోవచ్చును,పత్తి అమ్మకాల వివరాలు తెలుసుకోవచ్చును , తక్పట్టి వివరాలు తెలుసుకోవచ్చును,రైతులకు చెల్లింపు వివరాలను తెలుసుకోవచ్చును ,ఏదైనా సమస్య ఉన్నచో ఫిర్యాదు చేయవచ్చును.రైతుల సౌకర్యార్థం పత్తి కొనుగోలు సంబంధిత సేవలకై 18005995779 నంబరు టోల్ ఫ్రీ కు కాల్ చేయగలన్నారు.



## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండ పల్లి, అక్టోబరు 21 ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో బూరిగల్లా యాదయ్య సోమవారం మృతి చెందారు.ఈ విషయం పడకల్ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ మృతుని కుటుంబానికి రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ నాయకులు చౌటి విజయ్ కుమార్ బండగల చందు చౌటి కుమార్ బూరిగాళ్ల రాములు నాయకంటి రమేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..**మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకరరెడ్డి రూ.3వేలు ,శ్రీనివాస్ రెడ్డి రూ.3వేలు అందించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జోగు రమేష్,తిరుపతి,బురిగల్ల రమేష్‌లు ఉన్నారు.

## దొంగతనం కేసులో వ్యక్తి రిమాండ్

**ధారూరు, అక్టోబరు 21 ప్రభాతవార్త:** మూసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని రిమాండ్ చేసినట్లు ఎస్సై సున్నం రాఘవేందర్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే, ధారూర్ మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన రుమ్మ యాదగిరి వికారాబాద్ లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే ఈ నెల 20న యాదగిరి వికారాబాద్ ండి అల్లాపూర్ గ్రామానికి వచ్చిసరికి తన ఇంటి తాళం విరగొట్టి బీరువాలో ఉన్న నగదు దుండగులు దొంగలించారు. ఈ మేరకు అత ను పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన అంతారం అనిల్ కుమార్‌పై అ ఎమానం వ్యక్తం చేయడంతో ఎస్సై సున్నం రాఘవేందర్ విచారణ చేయగా నేరం ఒప్పుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు, రిమాండ్ చేసినట్లు తెలిపారు. అతనిపై గతంలో బొమ్రాస్పేట్ పోలీస్ స్టేషన్లో కేసులు సైతం ఉన్నట్లు చెప్పారు.



## ప్రేమించే దానగుణం ఎల్లప్పుడు పరిమళిస్తుంది

### వైద్య చదువుల కోసం గిరిజన యువతికి రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేసిన మాజీ వార్డు సభ్యుడు గంగిశెట్టి చెన్నయ్య

**నందిగామ, అక్టోబరు 21, ప్రభాతవార్త :** నిరుపేద కుటుంబానికి చెందిన సరస్వతి పుత్రికకు వైద్య చదువుల కోసం రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు నందిగామ మండలం పిట్టలగూడ గ్రామానికి చెందిన గంగిశెట్టి చెన్నయ్య. మహబూబ్నగర్ మండలం వెంకటాపురం మాచనపల్లి తండాకు చెందిన కే రాజేశ్వరి నీట్ లో ఉత్తమ ర్యాంకు సంపాదించి వైద్య సీటు సంపాదించింది. మొదటి సంవత్సరం ఫీజు కట్టలేని పరిస్థితి తెలుసుకున్న చెన్నయ్య గిరిజన యువతి చదువుల కోసం ముందుకు వచ్చి ఆసరాగ నిలవడం పట్ల విద్యార్థిని తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలో అడ్మిషన్ అనంతరం విద్యార్థి వైద్య చదువుల కోసం త్వరలో రూ.1 లక్ష రూపాయలు సహాయం చేయనున్నట్లు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శివ మాస్టర్, మల్లేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన యువతకి వైద్య చదువులకు ఆర్థిక సాయం అందజేస్తున్న చెన్నయ్య

## ఉమా.. నువ్వు ఉన్నతికి ఎదగాలమ్మా..

**షాద్‌నగర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** చదువుకు తగ్గ ఉద్యోగంతో కానిస్టేబుల్ గా అవకాశాన్ని అందుకుంది.. ఒకవైపు ఇక్కడ సిన్సియర్ గా పనిచేస్తునే మరోవైపు గ్రూప్ 2 వైపు అడుగులు వేసింది. మొత్తానికి గ్రూప్ 2 ద్వారా అనుకున్నద లక్ష్యాన్ని సాధించి సచివాలయంలో ఫైనాన్స్ డిపార్ట్మెంట్లో ఉద్యోగాన్ని సాధించింది. కేశంపేట పోలీస్ స్టేషన్లో పనిచేసే కానిస్టేబుల్ ఉమా ఘనత ఇది. ఒక పరిశ్రమలో పనిచేసే యాదయ్య కూతురైన ఈ అమ్మాయి ఎమ్మెస్సి వరకు చదివి 2018 బ్యాచ్ లో కానిస్టేబుల్ గా ఉద్యోగాన్ని సంపాదించింది. తాజాగా మరో కొత్త విజయంతో అందరినీ ఆశ్చర్యపరిచింది. చదువుల తల్లి కృషి అద్భుతం.ప్రశంసించిన ఏసిపి లక్ష్మీ నారాయణ.. ఆర్థిక పరిస్థితులను అధిగమించి చదువుల వైపు అడుగులు వేయడమే కాకుండా ఒక్కో మెట్టు ముందుకు సాగుతూ కానిస్టేబుల్ ఉమా సాధిస్తున్న విజయాలు నేటి తరానికి ఆదర్శమని షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ అన్నారు.

తమ డిపార్ట్మెంట్లో పని చేస్తూ ప్రస్తుతం ఏకంగా సచివాలయానికి ఫైనాన్స్ డిపార్ట్మెంట్ లో ఉద్యోగం చేసేందుకు వెళుతున్న ఉమను ఆయన అభినందించారు. మంగళవారం శాలువాతో సత్కరించి ప్రశంసల వర్షం కురిపించారు. పోలీసు కానిస్టేబుల్ గా చక్కగా పనిచేసి పేరు తెచ్చుకున్న ఉమ తాను ప్రస్తుతం చేపడుతున్న ఉద్యోగం లోను గొప్ప పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షి ంచారు. అంతేకాకుండా భవిష్యత్తులో గ్రూప్ వన్ వంటివి రాసి ఉన్నత అధికారిగా గుర్తింపు పొందాలని అన్నారు. సిఐ నరహరితో పాటు ఇతర పోలీసు అధికారులు ఆమెను అభినందించారు.




ఉమను అభినందిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ



ప్రచారంలో పాల్గొన్న పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

## జూబ్లీహిల్స్‌లో బిజెపిదే గెలుపు ఖాయం

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

**షాద్‌నగర్,అక్టోబరు 21 ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోరులో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి దీపక్ రెడ్డి భారీ విజయంతో గెలుస్తారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, షాద్ నగర్ సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నామినేషన్ ర్యాలీలో కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డితో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి వారితోపాటు షాద్ నగర్ బిజెపి నాయకులు విజయ్ బాస్కర్, లష్కర్ నాయక్, మండల అధ్యక్షులు లక్ష్మీ శ్రీకాంత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి,అనిల్ కుమార్ గౌడ్, రంగన్న గౌడ్ తదితరులు హాజరయ్యారు. సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు కాంగ్రెస్ టిఆర్ఎస్ పాలన వల్ల విసిగిపోయారని ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా టిఆర్ఎస్ కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయంగా బిజెపి నిలుస్తుందని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు.

## తూంకుంటలో సదర్ మహోత్సవ్




.తూంకుంటలో సదర్ మహోత్సవ్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్,పాల్గొన్న యాదవసంఘం సభ్యుల దృశ్యం




తూంకుంటలో దీపావళి సందర్భంగ సదర్ మహోత్సవ్‌లో యాదవ సోదరులు సన్మానాలు అలయ్‌బలయ్ జరిగిన దృశ్యం

**శామీర్‌పేట, అక్టోబరు 21, ప్రభాతవార్త :** తూంకుంట గ్రామంలో దీపావళి పండుగను పురస్కరించుకుని యాదవ సంఘం వారి ఆధ్వర్యంలో సదర్ మహోత్సవ్ కార్యక్రమం జరిగింది. సోమవారం రాత్రి శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ కార్యాలయం వద్ద దీపావళి పండుగను పురస్కరించుకుని సదర్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సదర్ మహోత్సవ్ నిర్వాహణ వల్ల యాదవులలో ఉత్సాహం, ఐక్యత, సంబరాలు పండుగ వాతావరణం నెలకొందని పలువురు యాదవులు పేర్కొన్నారు. సదర్ మహోత్సవ్ సందర్భంగా యాదవ సోదరులు అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించుకుని సన్మానాలు చేసుకున్నారు. పోతుల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. గ్రామంలో సదర్ ఊరేగింపు ర్యాలీ కార్యక్రమం జరిగింది. దీనిలో తూంకుంట గ్రామ మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్, పలువురు యాదవ సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# సొంత నిధులతో రోడ్డు మరమ్మతు పనులకు శ్రీకారం -హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు



మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కేశంపేట ,అక్టోబరు 21 ప్రభాతవార్త;** కేశంపేట మండల పరిధిలోని చింతకుంటపల్లి,కొండారెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మాయంగా మారి ప్రయాణించడానికి ఇబ్బందిగా తయారైంది. ప్రయాణికులకు కలుగుతున్న ఇబ్బందులను గ్రహించిన గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకులు ఆల్లు శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు అనేమోని మల్లేష్ యాదవ్‌లు తమ సొంత నిధులతో జెసిబితో గుంతలను పుడ్చి రహదారికి మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నాణ్యత లేని బీటీ రోడ్డును నిర్మించడంతోనే రోడ్డు తొందరగా ధ్వంసం అయిందని ఆరోపిస్తున్నారు. రోడ్డు గుంతల మాయంగా మారడంతో అప్జల్ గంజి నుండి పెద్ద రేవల్లి వెళ్లే ఆర్టీసీ బస్సు బందు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మరమ్మత్తు పనులకు శ్రీకారం చుట్టినట్లు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రోడ్డు పై ఏర్పడ్డ గుంతలను పూడ్చిన గ్రామానికి చెందిన శ్రీధర్ రెడ్డి మల్లేష్ యాదవ్ లను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఉమ్మారి రాజు,బైకని మల్లేష్,లింగం యాదవ్, జంగయ్యా యాదవ్,పల్లెమోని పందు ముదిరాజ్,సూజీవనరెడ్డి శ్రీనుయాదవ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మెడిసిటి హాస్పిటల్ ఘనత

## 97 ఏళ్ల రోగికి ప్రోస్టేట్ శస్త్ర చికిత్స



రోగి అజీజ్‌తో వైద్యుడు నితేష్

**మేడ్చల్, అక్టోబరు 21, ప్రభాతవార్త ;** 97 సంవత్సరాల వయస్సున్న అజీజ్ అనే రోగికి మూత్రాశయ ద్వారంలో ఏర్పడిన అడ్డంకిని తొలగించేందుకు ప్రోస్టేట్ గ్రంథి తొలగింపు శస్త్ర చికిత్సను మెడిసిటి ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. మూత్ర విసర్జనలో తీవ్ర ఇబ్బందులు, లీకేజీ వంటి సమస్యలతో బాధపడుతున్న రోగిని పరీక్షి ంచిన వైద్యులు ప్రోస్టేట్ గ్రంథి పెరగడం (బినైన్ ప్రోస్టాటిక్ హైపర్‌ప్లాసియా) అనే వ్యాధిగా గుర్తించారు. ఈ క్లిష్టమైన శస్త్ర చికిత్సను డాక్టర్ నితేష్ (ప్రధాన మూత్రవ్యాధి నిపుణుడు, పురుష ఆరోగ్య నిపుణుడు) నేతృత్వంలోని వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ శస్త్ర చికిత్సలో అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ పి. బి. బెనర్జీ నేతృత్వంలోని డాక్టర్ గోపాలకృష్ణ మరియు అనస్థీషియా వైద్య బృందం ముఖ్య పాత్ర పోషించింది. శస్త్ర చికిత్స అనంతరం రోగి పూర్తిగా కోలుకొని సాధారణ జీవితం కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నితేష్ మాట్లాడుతూ, 97 ఏళ్ల వయస్సున్న రోగికి శస్త్ర చికిత్స చేయడం సవాలుగా ఉన్నప్పటికీ తగిన జాగ్రత్తలతో విజయవంతంగా పూర్తి చేయగలిగామని తెలిపారు. ఈ విజయానికి మిమ్స్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ మెడిసిటి ఆసుపత్రుల ప్రధాన కార్య నిర్వాహణ అధికారి ఐనిష్ మర్చంట్, వైద్యులు గీత, సల్మాన్ సాదిక్. వైద్య బృందం విశేషంగా కృషి చేశారని తెలిపారు.

# అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలి

**మెడికల్ కళాశాల,సమీకృత గురుకులాల తరలింపును ఆపాలి**
**కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా చేయాలి**
**నల్లబాడ్జీలతో వినూత్న నిరసన**
**కెడిపిజేఏసీ కమిటీ డిమాండ్**



కొడంగల్‌లో వినూత్న నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

**కొడంగల్,అక్టోబరు 21, ప్రభాతవార్త :** అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని మెడికల్ కళాశాల,సమీకృత గురుకులాలను కొడంగల్‌లో నిర్మించాలని లగచర్లలో నిర్మించనున్న ఇండస్ట్రియల్ కారిడార్‌ను అక్కడే ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకుంటాయని కెడిపిజేఏసీ కన్వీనర్ లక్ష్మనారాయణ,కోకన్వీనర్‌లు గంటి సురేష్‌కుమార్,ఎర్రన్‌పల్లి శ్రీనివాస్,రమేష్‌బాబు అన్నారు.మంగళవారం కొడంగల్‌లో కెడిపిజేఏసీ అద్వర్యంలో వినాయక్ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మూతులకు నల్లబ్యాడ్జీలు ధరించి వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొడంగల్‌లో మెడికల్ కళాశాల,సమీకృత గురుకులాల పాఠశాలలను నిర్మిస్తామని చెప్పి మాట మార్చి లగచర్లకు తరలించడం కొడంగల్ ప్రాంతానికి ద్రోహం చేయడమే అన్నారు.కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి నియోజకవర్గ కేంద్రాన్ని అభివృద్ధి చేయకుండా ఇతర ప్రాంతాలకు తరలించి అభివృద్ధి చేసుకుంటే కొడంగల్‌పై ఎందుకు వివక్ష చూపుతున్నారన్నారు.15రోజులుగా కెడిపి అద్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించినా ప్రభుత్వం నప్రజలకు సమాధానం చెప్పకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం విచారాకరమన్నారు.కొడంగల్ అనేక రోజులుగా వెనుకబాటుగకు గురైందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతం నుడి గెలుపొందంతో అభివృద్ధి జర్గుతుందని ఆశిస్తే ఇప్పుడు కాలేజీల తరలింపుతో కొడంగల్ అభివృద్ధికి భవిష్యత్తులో నోచుకోదన్నారు.ఇప్పటికైన సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ అభివృద్ధి చేసి ఈ ప్రాంతపై తన ప్రేమను చాటుకోవాలన్నారు.అనేక సంవత్సరాలుగా వెనుకబాటుతకు గురవుతున్న కొడంగల్ సీఎం రేవంత్‌రెడ్డితో అభివృద్ధి జరిగితే భవిష్యత్తులో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు చిరస్ధాయిగా నిలుస్తుందన్నారు.ఈ ప్రాంతం నుండి అనేక సంవత్సరాలుగా వలసలు వెళ్తున్నారని విద్య,వైద్యానికి నోచుకోవడం లేదన్నారు.మెడికల్ కళాశాల,సమీకృత గురుకులాలు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం విద్య,వైద్యం అందడంతో పాటు ఈ ప్రాంతం అభవృద్ధికి నోచుకుంటుం దన్నారు.ఇప్పిటికైనా సీఎం రేవంత్‌రెడ్డి మెడికల్ కళాశాల,సమీకృత గురుకులాల తరలింపును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఎం. గౌసన్,నవాజ్,భీమరాజ్,రమేష్‌బాబు,పవన్‌లాహోటీ,దస్తప్ప,సూర్యానాయక్,శ్రీనివాస్, పకీరప్ప,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



షాబాద్ లోని రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నాయకులు

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

**షాబాద్, అక్టోబరు 21, ప్రభాతవార్త :** బిసిలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు పోరా డుతామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. బిసి రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంతో షాబాద్లో అంబేద్కర్ చౌరస్తాలో బిసి రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు పదవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బిసి నాయకులు మాట్లాడు తూ.. 40 ఏండ్లుగా బిసిలకు అన్యాయం చేస్తూ అణగదొ క్కుతున్నారని అన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు న్యాయమైనవని, అన్ని పార్టీలు మద్దతు తెలపాలన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు రిలే నిరహార దీక్ష చేపడుతామన్నారు. రిలే నిరాహార దీక్షలకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమకారుడు దేశమొల్ల ఆంజనేయులు, బిఆర్ఎస్ నాయకుడు గూడూరు నర్సింగరావు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి రిజర్వేషన్ సాధన సమితి సభ్యులు జడల రాజేందర్ గౌడ్, తమ్మలి రవిందర్, రాపోలు నర్సింలు, ఒగ్గు రాజు, నక్క శ్రీనివాస్ గౌడ్, రాము, కుమ్మరి దర్శన్, వెంకటేష్ చారి, జ్ఞానేశ్వర్ చారి, రామాచారి, నరసింహ చారి, గడ్డం చంద్రయ్య, సత్యనారాయణ, రమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## బిసి, ఎస్సి, ఎస్టి, మైనార్టీలు ఏకం కావాలి

**బిసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ**

**షాబాద్, అక్టోబరు 21, ప్రభాతవార్త :** తమ హక్కుల సాధన కోసం బిసి, ఎస్సి, ఎస్టి, మైనార్టీలు ఏకం కావాల్సిన అవసరం ఉందని బిసి సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలో బిసి, ఎస్సి, ఎస్టి, మైనార్టీలు జేఏసీ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 23న మండల కేంద్రంలో అన్ని జేఏసి నాయకులతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి అధిక సంఖ్యలో బిసి, ఎస్టి, ఎస్సి, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. తమ హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ పోరాటంలో పాల్గొనాలని అన్నారు. జనచైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు మల్లగల్ల మల్లేష్ గౌతమ్, వెంకటేష్, చొక్కపేట అంజనేయులు, బిసి సేన మండల అధ్యక్షులు దయాకర్ చారి, నాయకులు అజయ్, చందు, జంగయ్య, శేఖర్, మల్లేష్, సత్యమ్, మహేష్, పాను గంటి రాములు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బర్క కృష్ణ



అలియాబాద్‌లో దీపావళి సందర్భంగ పారిశుద్య కార్మికులకు ఉచితంగ దుస్తుల పంపిణీ చేసిన మండల బిఆర్ఎస్ నాయకులు టి.జగదీశ్వర్‌గౌడ్ దృశ్యం

## అలియాబాద్‌లో పారిశుద్య కార్మికులకు ఉచితంగా దుస్తుల పంపిణీ

**శామీర్‌పేట, అక్టోబరు 21, ప్రభాతవార్త :**అలియాబాద్‌లో పారిశుద్య కార్మికులకు దీపావళి పండుగను పురస్కరించుకుని ఉచితంగ దుస్తులను శామీర్‌పేట మండల బిఆర్ఎస్ నాయకులు టి.జగదీశ్వర్‌గౌడ్ పంపిణీ చేశారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ గ్రామంలో దీపావళి పండుగ సందర్భంగా మున్సిపల్ పారిశుద్య కార్మికులకు సేవా భాగంగా దుస్తులను అందజేసినట్లు మండల బిఆర్ఎస్ నాయకులు టి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. వారికి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దీనిలో పలువురు అలియాబాద్ మున్సిపల్ పారిశుద్య కార్మికులు పలువురు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ ఆదేశాలతో శ్రీనిరంజన అభివృద్ధి పనులపై చర్చ

**కొడంగల్,అక్టోబరు 21, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి



నిరంజన మఠంను సందర్శించిన కడా ప్రత్యేక అధికారి,నాయకులు

రేవంత్‌రెడ్డి ఆదేశాలతో కొడంగల్ పట్టణంలో శ్రీనిరంజన మఠం అభివృద్ధి పనులపై అధికారులు,నాయకులు చర్చించారు. మంగళవారం కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి,మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్,కాంగ్రెస్ మండల పార్టీ అద్యక్షులు నందారం ప్రశాంత్ తదితరులు శ్రీజగద్గురు నిరంజన మఠంను సందిర్శించారు.అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో మఠం అభివృద్ధి పనులపై వారు చర్చించారు.మఠంలో చేపట్టాల్సి అభివృద్ధి పనులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు.

## దర్గాను యధాస్ధానంలో ఏర్పాటు చేయాలి

**కొడంగల్,అక్టోబరు 21, ప్రభాతవార్త :** రోడ్డు విస్తరణలో భాగంగా అర్ధరాత్రి అకస్మాత్తుగా తొలగించిన మహిబుసుభాని దర్గాను యధాస్ధానంలో ఏర్పాటు చేయాలని ఎంఐఎం తాలూకా అధ్యక్షులు ఎస్బీ.గుల్షన్ డిమాండ్ చేశారు.మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొడంగల్ పట్టణంలో రోడ్డు విస్తరణలో తొలగించిన దర్గాను యధాస్ధానంలో ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హమీ ఇచ్చారని గుర్తు చేశారు.తొలగించిన దర్గా విషయంలో ఇటీవలే హైద్రాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సందర్భంలో దర్గాను అక్కడే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం హమీ ఇవ్వడం జరిగిందన్నారు.అయితే 20 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు అమలుకు నోచుకోవడం లేదన్నారు.వెంటనే దర్గా నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఈనెల 24న రిలే నిరహారదీక్ష చేపడుతామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు షేక్ రోమాన్,ఎండీ,సర్దాజ్ హుస్సేన్,సయ్యద్ ముస్తాపా,ఎండీ,ముర్తుజా,ఎండీ అమీర్ హుస్సేన్,సయన్యద్ అర్షద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఐఎం పార్టీ నాయకులు



## విద్యార్థులకు బ్రెక్‌ఫాస్ట్‌లో అదనంగా సెట్ దోశ

**కొడంగల్,అక్టోబరు 21, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అదనంగా సెట్ దోశను అందిస్తున్నారు.విద్యార్థులకు రెండు చొప్పున అందించడానికి హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ మంగళవారం శ్రీకారం చుట్టారు.కొడంగల్ నియోజకవర్గంలోని 8 మండలాలల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా అల్పాహార పథకంలో భాగంగా మంగళవారం సెట్ దోశలను విద్యార్థులకు ఫౌండేషన్ నిర్వహకులు తొలి ప్రయత్నంగా కొడంగల్‌లోని బాలికల పాఠశాలలోని 700 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు.విద్యార్థినీల ఫీడ్ బ్యాక్ తీసుకొని రుచికరంగా ఉందని తెలుపడంతో 8 మండలాల్లోని విద్యార్థులందరికి నాణ్యమైన రుచికరమైన దోశలను అందిస్తామని డిప్యూటీ మేనేజర్ కృష్ణచైతన్య తెలిపారు,ఇడ్లీ,మిల్లెట్ ఇడ్లీ, ఉప్మా,పొంగలి,బోండా,పూరిలతో పాటు సెట్ దోశలను కూడ అందించడానికి సిద్ధంగా ఉన్నామని చైతన్య తెలిపారు.

## బూర్గుల సుమన కన్నుమూత

**షాద్‌నగర్, అక్టోబరు 21, ప్రభాతవార్త :** ఫరూక్ నగర్ మండలం బూర్గుల గ్రామ మాజీ ఎంపీటీసీ మరియు సర్పంచ్ బూర్గుల సుమన అనారోగ్యంతో ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఈమె హైదరాబాద్ మొదటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు సోదరుడి కుమార్తె , బూర్గుల



నరసింగరావు చెల్లెలు. ఈమె బూర్గుల గ్రామానికి ఒక సారి ఎంపీటీసీ గా మరియు సర్పంచ్ గా సేవలందించారు.. అంతే కాకుండా ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో తాను టీచర్ గా తన దగ్గర చదువుకున్న ఆ నాటి విద్యార్థుల సహకారం తో బూర్గులలో "ప్రగతి వెల్ఫేర్ అసోసియేషన్" ను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నేడు ఈ అసోసియేషన్ అనేక గ్రామాలకు విస్తరించి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుంది.. అంతేకాదు తాను చనిపోయినా తన శరీరం పదిమందికి ఉపయోగ పడాలని హాస్పిటల్ కి దానం చేస్తున్నట్లు వీలునామా రాసుకున్న గొప్ప వ్యక్తి. ఆమె లేని లోటు బూర్గుల గ్రామ ప్రజలతో పాటు చుట్టూ పక్కల ప్రజలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పోలీసు అమరవీరులకు ఘన నివాళులు



అమరవీరులకు నివాళులర్పిస్తున్న మంచాల పోలీసులు

**మంచాల, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** మంచాల మండల పోలీస్ స్టేషన్లో పోలీసుల అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 2001 సంవత్సరంలో అప్పటి మంత్రి పుష్పలీల ను లక్ష్యంగా చేసుకొని పెట్టిన మందు పాత్రను పేల్చిన ఘటనలో అమరులైన అప్పటి ఎస్సై సైదయ్య, కానిస్టేబుల్ సాయిలు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతి చెందిన పోలీసులను ఉద్దేశించి పలు విషాద ఘటనలను చర్చించారు. ఐదు నిమిషాల మోనం పాటించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంచాల సీఐ మధు మాట్లాడుతూ విధి నిర్వహణలో కుటుంబానికి దూరంగా ఉండటంపై మాట్లాడారు. పలు ఘటనల్లో అమరులైన పోలీసులను స్మరించుకుంటూ అమరుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ మధు, ఎస్ఐ వంశీ, ఏ.ఎస్.ఐ .సతీష్, హెడ్ కానిస్టేబుల్ దేవానంద్, కృష్ణ, దామోదర్, కానిస్టేబుల్ వేణుగోపాల్, శ్రీను,గాలిబ్,సాయిరాం, ప్రభుకుమార్,స్వాతి ,చైతన్య, శిరీష, జంగమ్మ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ పహిముద్దీన్‌కి ఎస్సై శ్రీకాంత్ నివాళి

**తలకొండపల్లి, అక్టోబరు 21, ప్రభాతవార్త :** తలకొండపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం



తలకొండ పల్లిలో నివాళులు అర్పిస్తున్న ఎస్ ఐ శ్రీకాంత్

నాడుపోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విధి నిర్వహణలో అమరుడైన కానిస్టేబుల్ పహిముద్దీన్ చిత్ర పటానికి ఎస్సై ఎ. శ్రీకాంత్ మరియు పోలీసు



సిబ్బంది అందరూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎస్ ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ఎంతో పోలీస్ సిబ్బంది ప్రాణాలు వదిలారని,వారిని మార్చుకోవటం మన బాధ్యత అన్నారు.సమాజం బాగుకోసం అటు పోట్లు ఎదుర్కోవాలని ఈసందర్భంగా ఆయన తెలిపారు.అనంతరం తలకొండ పల్లిలోప్రాణాలు వదిలిన కానిస్టేబుళ్ల స్మరించుకున్నారు.ఈకార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

## దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వారి స్ఫూర్తితో పనిచేయాలి ఇన్స్పెక్టర్ గంగాధర్

**కడ్తాల్, అక్టోబరు 21, ప్రభాతవార్త :** అక్టోబర్ 21, పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ ఇన్స్పెక్టర్ గంగాధర్ అధ్వర్యంలో ఎస్సైలు , పోలీస్ లతో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వారి స్ఫూర్తితో సేవా దృక్పథంతో పనిచేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యాచారంలో విద్యార్థులచే ర్యాలీ

**యాచారం,అక్టోబరు 21, ప్రభాతవార్త :** యాచారం పోలీస్ స్టేషన్ లో అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. యాచారం కేంద్రంలోని జోవియల్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ రేఖా శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో సీఐ నందీశ్వర్ ఎస్సైలు మధు సత్యనారాయణలతో కలిసి సిబ్బంది సాగర్ రహదారిపై విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి పోలీస్ అమరవీరులను గుర్తు చేశారు. ఈ సందర్భంగా సిఐ నందీశ్వర్ మాట్లాడుతూ పోలీసులు ఎన్నో త్యాగాలు చేస్తేనే నేడు సమాజం శాంతిభద్రతలతో ఉందన్నారు. ప్రజల సమన్వయం ప్రజాప్రతినిధుల సహకారంతో శాంతియుత వాతావరణం ఏర్పాటు చేయవచ్చు అన్నారు. నేరాలు అదుపులో ఉండాలంటే ప్రజల సహకారం చాలా అవసరం అన్నారు.ఎందరో పోలీసులు తమ ప్రాణాలను త్యాగం చేసి శాంతి భద్రతలను కాపాడడంలో జీవితాలను కోల్పోయారని కొనియాడారు.



యాచారం పోలీస్ స్టేషన్లో జోవియల్ స్కూల్ విద్యార్థులచే ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## నేటి నుంచి కార్తీకమాస పూజలు ప్రారంభం -రోజూ అన్నప్రసాద వితరణ

**ఘట్‌కేసర్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబమల్లికార్జునస్వామి దేవాలయంలో బుధవారం నుంచి కార్తీకమాస పూజలు ప్రారంభం కానున్నాయి. ఆలయంలో నెల రోజుల పాటు జరిగే కార్తీకమాస పూజల కోసం అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త కంట్లం శ్రీశైలం తెలిపారు. బుధవారం ఉదయం 5:30 గంటలకు అభిషేకంతో పూజలు మొదలవుతాయని, నెలరోజుల పాటు ఆలయంలో కార్తీక పూజలు ఉంటాయని, ప్రతి రోజు అన్నప్రసాద వితరణ చేస్తారని అన్నప్రసాద వితరణ చేసే దాతలు కంట్లం నవీన్‌కుమార్ 9885670329 ను సంప్రదించాలని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని శ్రీశైలం కోరారు.